వెదజల్లుతో రైతుకు ఆదా

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- ఖర్చులు, సమయం ఆదా
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 5 శాతం పూర్తి

పెదపూడి: వ్యవసాయ ఖర్చులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక పద్ధతిలో సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలతో పాటు కూలీ ఖర్చులు తడిసి మోపెడవ్వడంతో రైతులు నాట్లు వేసే పద్ధతికి క్రమంగా స్వస్తి చెబుతున్నారు. వెదజల్లు సాగు విధానంలో ముందుకు సాగుతున్నారు.

ప్రయోజనాలు

వెదజల్లు సాగు పద్ధతిలో నాట్లు వేయడంతో విత్తన ఖర్చు ఎకరానికి 18 కేజీలు ఆదా అవుతుంది. నారు తయారు చేయడానికి ఎకరానికి అయ్యే ఖర్చు రూ.4,000 మిగులుతుంది. నాట్లు వేసే సమయంలో వరినారు తీయడానికి, నాట్లు వేసేందుకు కూలీలకు అయ్యే ఖర్చు ఎకరానికి సమారుగా రూ.7 వేలు ఆదా అవుతుంది. దీనికితోడు కూలీల కొరతను అధిగమించవచ్చు. వెదజల్లడంతో విత్తనాలు పైపైనే పడి తొందరగా పిలకలు వృద్ధి చెందుతాయి. ఒక్కొక్క మొక్క ఉండడంతో పోషక విలువలన్నీ మొక్కకు సమంగా అందుతాయి. గాలి, వెలుతురు సమాన స్థాయిలో ప్రసరించడంతో పంట ఆరోగ్యంగా పెరిగి చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. ధృడమైన పిలకలు ఎక్కువగా ఉండడంతో దిగుబడి ఐదు బస్తాలు అధికంగా వస్తుంది.

వెద సాగులో మెళకువలు

సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలు వెద సాగుకు అనుకూలంగా ఉంటాయి. ముంపునకు గురయ్యే భూములు, చౌడు, క్షారము, ఆమ్లము వంటి భూములు ఈ సాగుకు అనుకూలం కాదు అని వ్యసాయశాఖాధికారులు తెలిపారు.



పెదపూడిలో వెదసాగు చేస్తున్న పొలం

పొలం తయారీ

సాధారణ పద్ధతిలో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్టుగానే ఈ వెదజల్లు సాగు పద్ధతిలో పొలం తయారు చేయాలి. పొలంలో నీరు నిలువ ఉండకూడదు. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి ఏర్పాట్లు చేయాలి. వీలైనంత బాగా చదును చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుంటే చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం చల్లడానికి అనుకూలంగా ఉంటుంది.

విత్తనాన్ని మండె కట్టే విధానం

విత్తనాలను 24 గంటలు నానబెట్టి, నానిన విత్తనాలను గోనె సంచిలో వేసి లేదా గోనె సంచి కప్పిగానీ 24 గంటలు పాటు ఉంచాలి. 24 గంటల తర్వాత చూస్తే విత్తనాల ముక్కు పగిలి తెల్లగా మోసు వస్తుంది. రబీ పంట కాలంలో ఉష్ణోగ్రత తక్కువ ఉంటుంది. దీంతో విత్తనాన్ని 36 గంటలు మండె కట్టాలి. అనంతరం పొలంలో క్రమ పద్ధతిలో జల్లుకోవాలి.

57,442 ఎకరాలో వరి సాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12వేలు, పెదపూడిలో 18వేలు, రంగంపేటలో 2వేలు, బిక్కవోలులో 13వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాలు, రాజానగరంలో 8,060 ఎకరాల్లో అన్నదాతలు సిద్ధమయ్యారు. అయితే ఈ మండలాల్లో సుమారు 80 శాతం మేరు రైతులు వెదజల్లు సాగు విధానంలో వరిని సాగుచేయడానికి సిద్ధమైనట్టు ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికి ఐదుశాతం మేర వెదసాగు చేసినట్లు అధికారులు తెలిపారు.

రబీ సాగుకు వరిలో రకాలు

ఈ రబీ సీజన్లో ఎంటీయూ, 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలను సుమారు 80శాతం రైతులు సాగు చేయనున్నారు. మిగిలిన 20 శాతంలో విత్తనాల నిమిత్తం స్వర్ణరకం సాగు చేయనున్నారు. ఇంకా బోండాలు, ప్రైవేటు వరి రకాలు రైతులు సాగు చేయవచ్చని ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఈ పద్ధతిలో ఖర్చులు తక్కువ



వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చు. మండలంలో సుమారు 5శాతం మేర వెదజల్లు సాగు చేశారు. అధిక సంఖ్యలో రైతులు వెదసాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. రైతులకు సూచనలు సలహాలు అందజేస్తున్నాం

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి, పెదపూడి మండలం

కూలీల కొరతను అధిగమించవచ్చు



కూలీల కొరత అధికంగా ఉంది. దానిని అధిగమించడానికి వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తే మేలు. ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చునని అధికారులు చెబుతున్నారు.

– టి.సత్యనారాయణ, రైతు, కరకుదురు

క్లుప్తంగా

హిందుత్వాన్ని గుర్తించిన ప్రపంచ దేశాలు



మాట్లాడుతున్న సర్పంచ్ ముత్యాలు

సీతానగరం: హిందుత్వాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయని సీతానగరం సర్పంచ్ కొండ్రపు ముత్యాలు అన్నారు. స్థానిక శివాలయంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. సర్పంచ్ ముత్యాలు మాట్లాడుతూ దేశంలో హిందువుల ఐక్యత కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. వంగలపూడిలోని శ్రీలలితాశ్రమం శ్రీమాతా విజ్ఞానందగిరి, ఫౌండేషన్ గోదావరి జోన్ సంయోజకులు బండ్ల రామశంకర్, పద్మశ్రీ, కొనపల అభిలాష్, సురేష్ కుమార్, జితేంద్ర, పి.వెంకటలక్ష్మి ,సునీత, శ్రీవిద్య పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించాలి



బండికి పెట్రోల్ కొడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని సింగంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో జిల్లా కో–ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంకు వారి పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా దగ్గరలో నిర్మించిన ఈ పెట్రోల్ బంకును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ శివశంకర ఆనంద్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బన్న పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ సాయిబాబు

పెదపూడి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వీవీ సాయిబాబు అన్నారు. పుట్టకొండ, పెద్దాడ గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిబాబు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన సభలో వివిధ శాఖాధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను శాఖల వారీగా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోకన్వీనర్ మేడపాటి హరినారాయణరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మురముళ్ల వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఎంసత్యనారాయణరెడ్డి, సర్పంచులు వల్లు వెంకటరమణ, దొకుబుర్ర మీనాక్షి, సచివాలయ కార్యదర్శులు చిన్ని, జి.త్రినాథ్ పాల్గొన్నారు.

సీసీ డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ



సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్ తదితరులు

రంగంపేట: మండల పరిధిలోని జి.దొంతమూరు పంచాయతీ శివారు గ్రామం బాలవరంలో శనివారం సీసీ డ్రైన్ల నిర్మాణానికి సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణలు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ మాట్లాడుతూ రూ.5 లక్షల ఎంపీటీసీ నిధులతో గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, పార్టీ కన్వీనర్ మందనక్క తులసీరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ లబ్ధి



వెదుళ్లపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వెదుళ్లపల్లిలో గడప గడపకూ..

సీతానగరం: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని వెదుళ్లపల్లిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనం నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతోందన్నారు. ఇటువంటి ప్రభుత్వమే మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, ఎంపీటీసీ నూతంగి ధనలక్ష్మి కుమారి, పార్టీ నాయకులు కవల కృష్ణమూర్తి, అంబటి రాజు, తన్నీరు త్రిమూర్తులు, తాతాజీ పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ సెంటర్‌లోని పాతటౌలుసుల రఫాయేలు గ్రౌండ్‌లో శనివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పినట్టు ప్రతి ఒక్కరూ శాంతి, సహనం కలిగి ఉండాలన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన స్వర్ణదేవాలయం – బైబిల్ మిషన్ పాస్టర్ డాక్టర్ జి.ఇమ్మానియేలు రాజు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆనంద కుమార్, ముఖ్యసలహాదారులు వరగేటి ప్రసన్న కుమార్, పాస్టర్లు పరదేశి, ఏపీ పరంజ్యోతి, కె.అబ్రహం పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

పెదపూడి: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేంద్ర, చింతపల్లి, సంపర గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే భారీ వర్షానికి తడిసిన ధాన్యపు రాసులను, నేలంటిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇప్పటికే వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖాధికారులతో ఏయే గ్రామాల్లో ఎంత మేర పంట దెబ్బతిందో నష్ట అంచనాలు తయారుచేయిస్తున్నామని చెప్పారు. నష్ట అంచనా నివేదికలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అందుతున్నాయన్నారు. రైతుల సంక్షేమం జగన్‌తో సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచులు కోసూరి వాసు, కొల్లు లోవకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంపరలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని, సీఎం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలే దీనికి నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–2 పరిధిలోని ఇందిరా నగర్, బాబా నగర్, శిలువుల మ్మగుడి తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు ఇంటింటా హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. సాంకేతిక లోపంతో సంక్షేమ పథకాలు అందని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలను చేరవేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గడప గడపకూ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకు వెళుతున్న ప్రజాప్రతినిధులకు లభిస్తున్న ఆదరణే దీనికి నిదర్శనమన్నారు. సమర్థవంతమైన పాలనను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, ఎంపీటీసీలు బండారు శ్రీనివాసరావు, కొండేటి భీమేష్, వార్డు సభ్యులు కోటంశెట్టి పద్మావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ఇందిరానగర్ వాసులు

నేడు దోసకాయలపల్లిలో వికసిత్ యాత్ర

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఆదివారం వికసిత్ భారత సంకల్పయాత్ర జరగనుంది. ఈ కార్యక్రమం ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం పరిశీలించారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పర్యటన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పారిశుధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దీనికి ముందు ఎయిర్‌పోర్టులో నిర్వహించబోయే టెర్మినల్ భవనం శంకుస్థాపన కార్యక్రమం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట జేసీ తేజ్ భరత్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, పంచాయతీ రాజ్ అధికారి జానా సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు, జిల్లా విద్యాశాఖాధికారి కె.అబ్రహం, సివిల్ సప్లయిస్ డీఎస్ఓ విజయ భాస్కర్, కోరుకొండ తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ పీకే నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



దోసకాయలపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలింపు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు వద్ద ఏడీబీ రోడ్డులో శనివారం వడిశలేరు నుంచి రాజానగరం వైపు వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వడిశలేరు గ్రామానికి చెందిన గుర్రే రవిబాబు తలకు బలమైన గాయమైంది. ఆ దగ్గరలోనే ఉన్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ విషయం తెలుసుకుని వెంటనే ప్రమాదస్థలికి చేరుకుని క్షతగాత్రుడు రవిబాబును కానిస్టేబుల్ శేషగిరి సహాయంతో 108 వాహనంలోకి ఎక్కించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని మొదట రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన రవిబాబును 108 వాహనంలోకి ఎక్కిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

సందడిగా వైఎస్సార్ సీపీ కార్తిక వనసమారాధన

అనపర్తి: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 24వ కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ముందుగా తోటలో ఉన్న ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘటితంగా నిర్వహించే ఈ వన సమారాధనలు సమైక్య స్ఫూర్తిని నింపుతాయన్నారు. వన సమారాధనలో సుమారు 4 వేల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధన

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు.



కృష్ణునిపాలెంలో శివాలయంలో లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మృతురాలు లక్ష్మి (పాత చిత్రం)

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని సాయిరామ్ మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై పి.బుజ్జి బాబు కథనం ప్రకారం.. రామచంద్రపురానికి చెందిన గుత్తుల కృష్ణ అక్కడి మున్సిపల్ కార్యాలయం వద్ద కొబ్బరి బొండాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతడికి భార్య లక్ష్మి (55), ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దోసకాయలపల్లిలోని చిన్న కుమార్తె శాంతకుమారి భర్త వెంకట రమణ అయ్యప్ప మాల వేసుకున్నాడు. అతడి ఇరుముడి కార్యక్రమానికి కృష్ణ తన భార్య లక్ష్మితో కలసి శనివారం ఉదయం స్కూటీపై దోసకాయపల్లి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి రామచంద్రపురం వస్తున్నారు. తొస్సిపూడి వద్దకు వచ్చేసరికి బలభద్రపురం నుంచి కొమరిపాలెం వైపు వెళ్తున్న కర్రల లోడు లారీని తప్పించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో లారీని డ్రైవర్ కుడివైపు తిప్పడంతో స్కూటీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన లక్ష్మి తలపై నుంచి లారీ దూసుకుపోయింది. తల ఛిద్రమైపోయి, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కృష్ణ కూడా గాయపడ్డాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. లక్ష్మి మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీ తరలించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదల సంక్షేమం

రాజానగరం: పేదల ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిస్తూ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శనివారం రాజానగరం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, ముద్ర యోజన, స్మార్ట్ సిటీస్, ఎస్ఆర్ఈజీఎస్, డిజిటల్ ఇండియా, జలజీవన్ మిషన్, స్వామిత్ర, పీఎం పోషణ అభియాన్, పీఎం విశ్వకర్మ మున్నగు పథకాల గురించి సంబంధిత అధికారులతో ప్రజలకు అవగాహన కలిగించారు. అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ ఇన్‌చార్జ్ ఎం.సుబ్రహ్మణ్యం కోరారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం పోషణ కిట్లు, గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి జె.సత్యనారాయణ, ట్రైనీ కలెక్టర్ సువర్ణ, వివిధ శాఖల అధికారులు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్ముల దత్తు, సర్పంచ్ కుందేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఫరిజల్లిపేటలో కార్యక్రమం నిర్వహించారు.



రాజానగరంలో ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే రాజా సుడిగాలి పర్యటన



మోటారు సైకిల్‌పై పర్యటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం మండలంలోని మోటారు సైకిల్‌పై సుడిగాలి పర్యటన చేశారు. మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలతో ముంపు బారిన పడిన పంటలను పరిశీలించడానికి, రైతులతో మాట్లాడటానికి టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్‌బాబును మోటారు సైకిల్ ఎక్కించుకుని రఘుదేవపురం, రాపాక, నల్గొండ గ్రామాల్లో తిరిగారు. వర్జీనియా పొగాకు పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

గోకవరం: మండంలోని పెంటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద కార్తిక వనసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తికమాసంలో చివరి శనివారం, సెలవు దినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొలువైన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం అర్చకులు గరిమెళ్ళ ప్రకాశరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలబత్తుల ఈశ్వర్, కార్యదర్శి కడియం వెంకటరమణ, ట్రెజరీ సుగంధం సూరిబాబు, అప్పలబత్తుల వీరాచార్యులు, శివకోటి శ్రీనివాస్, దొరబాబు పాల్గొన్నారు.

టెర్మినల్ భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో మాట్లాడుతున్న సంజీవ్ జిందాల్

మధురపూడి: విమానాశ్రయంలో ఆదివారం జరిగే టెర్మినల్ నూతన భవన శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఢిల్లీ ఎయిర్‌పోర్టు అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జిందాల్ అన్నారు. కార్యక్రమానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం విమానాశ్రయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెన్నై ఎయిర్‌పోర్టు అథారిటీ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ పనికర్, ఇంజినీరింగ్ విభాగం జనరల్ మేనేజర్ మాయాదేవి పాల్గొన్నారు.

శివలింగానికి అన్నాభిషేకం

రాజానగరం: కార్తికమాసం సందర్భంగా కోరుకొండ మండలం గాడాలలోని కాశీఅన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి శనివారం అన్నంతో అభిషేకం చేశారు. ఆ గ్రామానికి చెందిన ఆడపడచులు ఐదుకాటాల బియ్యంతో తయారు చేసిన అన్నాన్ని వేద పండితులు మంత్రోచ్ఛారణ నడుమ పరమశివుని అభిషేకించారు.